కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టడాన్ని ఖండిస్తున్నాం

వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, డిసెంబర్ 19 : ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో అక్రమాలు జరిగాయంటూ అనవసరంగా కేటీఆర్‌పై కేసు పెట్టి ఏ1గా చేర్చడాన్ని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దీనిలో ఎక్కడ కూడా డబ్బులు కేటీఆర్ దుర్వినియోగం చేసినట్లు లేదని, హైదరాబాద్ ప్రతిష్ట పెంచేలా ఈ కార్ రేసింగ్‌ను హైదరాబాద్‌కు తీసుకువచ్చిన ఘనత కేటీఆర్‌కు దక్కుతుందన్నారు. రేవంత్‌రెడ్డి తప్పుడు నిర్ణయాలతో మన హైదరాబాద్ పరువు పోవడమే కాకుండా కేటీఆర్‌పై అక్రమంగా కేసు పెట్టడాన్ని బీఆర్ఎస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మొన్ననే మా లగచర్ల రైతులపై, అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిపై కేసుల విషయం మరచిపోక ముందే మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు పెట్టడం అన్యాయమన్నారు. చివరికి న్యాయమే గెలుస్తుందని, మాకు న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందన్నారు.

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని తెలంగాణ భవన్‌లో కలిసిన బీఆర్ఎస్ యువ నాయకుడు గుంటి చరణ్

బెయిల్‌పై మాజీ ఎమ్మెల్యే, రైతులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 19 : లగచర్ల రైతుల భూములు అన్యాయంగా లాక్కోవడం కోసం అధికారులు యత్నిస్తున్న సమయంలో గిరిజన రైతులు వారి భూములివ్వబోమని అడ్డుచెప్పారు. ఈ క్రమంలో అధికారులపై కొంతమంది దాడి చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయా తండాలకు చెందిన గిరిజన రైతులపై అక్రమ కేసులు బనాయించిన సీఎం రేవంత్‌రెడ్డి.. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిపై కూడా అక్రమ కేసు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితోపాటు లగచర్ల రైతులకు బెయిల్ మంజూరు చేయడంతో గురువారం జైలు నుంచి విడుదలైన నరేందర్‌రెడ్డిని శంషాబాద్ యువ నాయకుడు చరణ్ తెలంగాణ భవన్‌లో కలిశారు. గిరిజన రైతుల భూములు లాక్కుంటే ఊరుకునేదిలేదని ఆయన హెచ్చరించారు.

అబార్షన్లపై నివేదిక ఇవ్వండి

హెల్త్ సబ్‌సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- ఇందిరమ్మ ఇండ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి
- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

కొత్తూరు, డిసెంబర్ 19 : అబార్షన్లు ఎక్కువగా ఎందుకు జరుగుతున్నాయో నివేదిక ఇవ్వాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. కలెక్టర్ కొత్తూరు మండలంలోని పెంజర్లలో గురువారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే, మధ్యాహ్న భోజనం, హెల్త్ సబ్ సెంటర్లను తనిఖీ చేశారు. మొదట ఇందిరమ్మ ఇండ్ల సర్వే ఎలా జరుగుతుందో ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి సరేందర్‌ను అడిగి సర్వే వివరాలు తెలుసుకున్నారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించి అర్హుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం పెంజర్ల జడ్పీహెచ్ఎస్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. 10వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. పదో తరగతిలో విద్యార్థులు 10కి పది గ్రేడ్ పాయింట్స్ సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పక్కనే ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి అక్కడ ఉన్న చిన్నారులతో మాట్లాడారు. చిన్నారుల్లో రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లల్లో అనీమియా రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. చిన్నారుల హాజరు శాతంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం హెల్త్ సబ్ సెంటర్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. సబ్ సెంటర్‌లో అబార్షన్లు ఎక్కువగా ఉన్నాయని గమనించారు. అనంతరం డాక్టర్‌ను నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక అధికారి లీనా, ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సురేందర్, అధికారి షాకీర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

వసతి గృహాలను సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, డిసెంబర్ 19 : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. గురువారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహం 1, 2ను కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంటగదిలో బియ్యం, పప్పులు, కూరగాయలు, పరిసరాలను పరిశీలించారు. ప్రతిరోజూ కొత్త మెనూ ప్రకారం వండాలన్నారు. టిఫిన్, భోజనం ఎలా పెడుతున్నారని విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార విషయంలో శుచి, శుభ్రత పాటించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాత్‌రూమ్‌లు, టాయిలెట్స్‌ను పరిశీలించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వసతి గృహాల్లో ఫ్యాన్లు, లైట్లు, మేజర్, మైనర్ రిపేర్ పనులు ఎంత వరకు పూర్తి చేసారని వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. అన్ని పనులు పూర్తి చేసి రిపేర్‌కు ముందు ఫొటోలు, తర్వాత ఫొటోలు పంపించాలని తెలిపారు. విద్యార్థులు చదువుతున్న క్లాస్‌రూమ్‌లకు వెళ్లి చదువుతున్న తీరును పరిశీలించారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడుతూ అందరూ బాగా చదివి పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ పేర్కొన్నారు. తనిఖీలో షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఓనర్లు తల్లిదండ్రులే..

- పాఠశాలల అభివృద్ధికి కృషి
- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

మంచాల, డిసెంబర్ 19 : ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే వాటికి ఓనర్లుగా విద్యార్థుల తల్లిదండ్రులే ఉండాలని మాజీ ఐఏఎస్, రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. గురువారం మంచాల మండలం ఆరుట్ల జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోనే ఆరుట్ల గ్రామం మేజర్ గ్రామపంచాయతీ కావడంతో పాటు ఇక్కడ ప్రభుత్వ పాఠశాల క్యాంపస్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నా కూడా విద్యార్థుల సంఖ్య తగ్గడం ఏమిటని తల్లిదండ్రులను ప్రశ్నించారు.

ఆరుట్ల నుంచి ఇబ్రహీంపట్నంలో ఉన్న వివిధ ప్రైవేటు పాఠశాలలకు రోజూ 3వేల మంది విద్యార్థులు వెళుతున్నారని.. ప్రైవేటు పాఠశాలల్లో ఉన్న అన్ని సౌకర్యాలను సర్కారు బడుల్లో ఏర్పాటు చేయడం కోసం తగు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఈ నెల 29న విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల ఆవరణలో పాఠశాల అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. వారికి పాఠశాల పూర్తి బాధ్యతలతో పాటు ఉపాధ్యాయుల పనితీరును ఎప్పుడికప్పుడు పరిశీలించి తగు సలహాలు, సూచనలు చేయడానికి ఈ కమిటీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాజకీయాలకు తావులేకుండా పాఠశాల అభివృద్ధి కోసమే పనిచేసే కమిటీలను ఎన్నుకోనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో రాందాస్, తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

యాచారం : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. మండలంలోని మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అయన గురువారం పర్యటించారు. పాఠశాల తరగతి గదులను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పనితీరును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలను అందిస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. మెరుగైన ఫలితాలను రాబట్టాలని ఆయన పేర్కొన్నారు.

యాచారం : మేడిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ మురళి

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, డిసెంబర్ 19 : జిల్లాలోని ప్రభుత్వ లేక ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న దివ్యాంగ విద్యార్థులు 2024-2025 సంవత్సరానికిగాను ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం జనవరి 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల వివరాలతో telangana epass.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత ధ్రువపత్రాలను జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా కలెక్టరేట్ ఆఫీస్‌లో ఉన్న జిల్లా సంక్షేమ అధికారి రూం నం.9 కార్యాలయం, రెండవ అంతస్తు, వికారాబాద్‌లో సంప్రదించాలన్నారు. ఏదైనా సమాచార నిమిత్తం 9502912981ను సంప్రదించవచ్చని ఆమె సూచించారు.

ఆదిబట్ల, తుర్కయాంజాల్ మున్సిపాలిటీలకు అరుదైన గౌరవం

ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో చేంజ్ మేకర్స్ అవార్డును అందుకున్న కమిషనర్లు బాలకృష్ణ, అమరేందర్‌రెడ్డి

అవార్డు అందుకుంటున్న ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ

ఆదిబట్ల/తుర్కయాంజాల్, డిసెంబర్ 19 : జిల్లాలోని ఆదిబట్ల, తుర్కయాంజాల్ మున్సిపాలిటీలకు అరుదైన గౌరవం లభించింది. 2022 నుంచి 2024 వరకు మున్సిపాలిటీలో స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమాలు, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ప్రదర్శన చేయడంతోపాటు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా స్వచ్ఛ కార్యక్రమాలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన మున్సిపాలిటీలకు న్యూఢిల్లీలోని కేంద్ర విజ్ఞాన కేంద్రం, సెంటర్ ఫర్ సెన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ), హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వశాఖ అధ్వర్యంలో సంయుక్తంగా చేంజ్ మేకర్స్ కాన్క్లేవ్ కార్యక్రమాన్ని ఢిల్లీలోని సిల్వర్ హాక్ హాల్‌లో నిర్వహించారు. గురువారం సీఎస్ఈ డైరెక్టర్ డాక్టర్ సునీతానరైన్ ఆదిబట్ల, తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కమిషనర్లు బాలకృష్ణ, అమరేందర్‌రెడ్డికి అవార్డులను అందజేశారు. పట్టణాల్లో బహిరంగ మలవిసర్జన రహిత(ఓడీఎఫ్) స్థితిని కొనసాగించడంతో పాటు, వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబర్చడం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన మున్సిపాలిటీలకు ఈ అవకాశం దక్కింది. మున్సిపాలిటీ పాలకవర్గం, ప్రజలు, పారిశుధ్య సిబ్బంది సహకారంతో అవార్డు సాధ్యమైందని కమిషనర్లు బాలకృష్ణ, అమరేందర్‌రెడ్డి తెలిపారు.

అవార్డు అందుకుంటున్న తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి

పోటీతత్వాన్ని పెంపొందించేందుకే క్రీడల పోటీలు

సాంఘిక సంక్షేమ గురుకులాల 10వ రాష్ట్ర స్థాయి క్రీడల పోటీలను ప్రారంభించిన గురుకుల విద్యా సంస్థ అదనపు కార్యదర్శి కిరణ్మయి

కమ్మదనం గురుకుల పాఠశాలలో క్రీడాకారులతో గురుకుల విద్యా శాఖ, పోలీస్ శాఖ అధికారులు

షాద్‌నగర్, డిసెంబర్ 19 : విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించడంతో పాటు క్రీడా రంగాల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల పాఠశాల ఆవరణలో గురువారం రాష్ట్ర స్థాయి 10వ క్రీడల పోటీలను ప్రారంభించారు. గురుకుల విద్యా శాఖ అదనపు కార్యదర్శి కిరణ్మయి, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, గురుకుల పాఠశాలల నిర్వహణ అధికారి భీమయ్య, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత పోటీల జెండాలను ఆవిష్కరించి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పోటీ తత్వం ఉండాలని, పోటీ ప్రపంచంలో రాణించాలంటే అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు గ్రామీణ ప్రాంతాలకు చెందినవారని, ప్రభుత్వం నుంచి వారికి అన్ని వసతులను కల్పించి క్రీడల్లో రాణించేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొని గెలుపొందినవారికి మరోమారు అన్ని గురుకుల విద్యార్థినులతో కలిపి ఉన్నత స్థాయి క్రీడల పోటీలు ఉంటాయని తెలిపారు.

షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడల ఆవశ్యకతను వివరించారు. విద్యార్థినుల ప్రతిభను అభినందించారు. మూడు రోజుల పాటు సాగే ఈ క్రీడల్లో సుమారు 1200 మంది విద్యార్థినులు తొమ్మిది విభాగాల క్రీడల పోటీల్లో పాల్గొంటారని, విద్యార్థులకు సరిపడ మౌలిక వసతులను కల్పించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ స్థాయి అధికారులు, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, అధికారులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

కన్హాలో నవోదయ జాతీయ సమైక్యతా సమ్మేళనం

ఆకట్టుకున్న నవోదయ విద్యార్థుల కళా ప్రదర్శనలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్‌బీఎస్ ఢిల్లీ ప్రధాన కార్యాలయం జాయిట్ కమిషనర్ జ్ఞానేంద్రకుమార్ (ఇన్‌సెట్లో), నృత్యం చేస్తున్న నవోదయ విద్యార్థులు

నందిగామ, డిసెంబర్ 19 : నందిగామ మండలం కన్హా శాంతివనంలో నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవోదయ జాతీయ సమైక్యతా సమ్మేళనం వేడుకలను ఎన్‌బీఎస్ ఢిల్లీ ప్రధాన కార్యాలయం జాయిట్ కమిషనర్ జ్ఞానేంద్ర కుమార్ ముఖ్య అతిథిగా హాజరై గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సమ్మేళనంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన నవోదయ విద్యార్థులు సుమారు 500 మందికి పైగా హాజరై విభిన్న రాష్ట్రాల కళా ప్రదర్శనలు సమ్మేళనంలో ఆవిష్కరించారు. ప్రత్యేకంగా సాంస్కృతిక సంబురాల్లో దక్షిణ, ఈశాన్య, ఉత్తర భారతదేశ సంప్రదాయ, జానపద, గ్రామీణ కళలను విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించి అకట్టుకున్నారు. ఈ సందర్భంగా జ్ఞానేంద్రకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని, చిన్న వయస్సు నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి అద్భుతాలు సృష్టించాలని కోరారు. నవోదయ విద్యాలయ సమితి ద్వారా చదువుకుని దేశ, విదేశాల్లో ఎంతో మంది ఉన్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని, ధ్యానాన్ని ప్రతిఒక్కరూ జీవితంలో భాగంగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌బీఎస్ ఢిల్లీ అసిస్టెంట్ కమిషనర్ సంగీత, ఎన్‌బీఎస్ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ, రిటైర్డ్ ఐఏఎస్ మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

హౌసింగ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ ఐఏఎస్ వీపీ గౌతమ్

తట్టి అన్నారం హౌసింగ్ బోర్డు కాలనీల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న హౌసింగ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ ఐఏఎస్ వీపీ గౌతమ్, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

పెద్దఅంబర్‌పేట్, డిసెంబర్ 19 : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని హౌసింగ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ ఐఏఎస్ వీపీ గౌతమ్ అన్నారు. గురువారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని తట్టి అన్నారం హౌసింగ్ బోర్డు కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆయన రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అర్హుల ఎంపికలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి పారుదలలో హైడ్రా కలకలం!

- చెరువుల హద్దుల నిర్ధారణలో పాత ఎన్ఓసీలతో సమస్య
- ఇప్పటికే ముగ్గురు అధికారులపై చర్యలకు సిఫారసు
- మరో ఎనిమిది మందిపై ఫిర్యాదు చేయనున్న హైడ్రా

సిటీబ్యూరో, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : హైడ్రా చర్యలతో నీటిపారుదల శాఖలో కలకలం రేగుతున్నది. ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు సంబంధించిన నివేదికలో అవకతవకలకు పాల్పడినట్లు ముగ్గురు సీనియర్ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వానికి హైడ్రా సిఫారసు చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఆ ముగ్గురు అధికారులపై పెనాల్టీ చర్యలు తీసుకునే దిశగా చర్యలు ప్రారంభించారు. లేక్ వ్యూ అపార్ట్‌మెంట్స్ పేరిట వెలసిన చాలా హైరైజ్డ్ భవనాల విషయంలో నీటి పారుదల శాఖ అధికారుల ఎన్ఓసీలు సమస్యగా మారుతున్నాయని పలు అంతర్గత సమావేశాల్లో రంగనాథ్ వ్యాఖ్యానించారు.

హైడ్రా ప్రారంభమైన కొన్ని రోజులకే ఇరిగేషన్‌కు సంబంధించిన ఒక అధికారిపై చర్యలకు ప్రభుత్వానికి హైడ్రా లేఖ రాసింది. తాజాగా రిటైర్డ్ ఎస్ఈ వెంకటేశం, ఈఈలు భీమ్ ప్రసాద్, శేఖర్‌రెడ్డిలపై చర్యలకు సిఫారసు చేసింది. మరో ఎనిమిది మంది నీటి పారుదల శాఖ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని లేఖలు రాయనున్నట్లు సమాచారం. వీరంతా తమ పరిధిలో ఉన్న జోన్లలో ఎన్ఓసీలు జారీ చేయడం వల్ల పలు చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురయ్యాయంటూ రంగనాథ్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు.

ఎనిమిది మందిపై ఫిర్యాదుకు నివేదిక..

పటాన్‌చెరు, ఇస్నాపూర్, దుండిగల్, ఘట్‌కేసర్, శంషాబాద్, మేడ్చల్, శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నం, తుర్కయాంజల్ తదితర ప్రాంతాల్లో లేక్‌వ్యూ ప్రాజెక్టుల పేరిట వెలసిన పలు అపార్ట్‌మెంట్లకు పాత మ్యాపులతో ఎన్ఓసీలు ఇచ్చినట్లు హెచ్ఎండీఏ, ఇరిగేషన్, హైడ్రా అధికారులు గుర్తించారు. హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో సదరు స్థలం బఫర్ జోన్‌లో ఉన్నట్లు తేలితే గూగుల్ మ్యాపులతో దరఖాస్తులను జతచేసి, పాత మ్యాపుల ఆధారంగా ఎన్ఓసీలు తీసుకున్నట్లు హైడ్రా గుర్తించింది. కొన్నిచోట్ల మ్యాపులే మాయమయ్యాయని కూడా తమ పరిశీలనలో తేల్చారు. అంతేకాకుండా ఇటీవల హైడ్రా బృందం పలు చెరువుల సందర్శనలో నీటి పారుదల శాఖ అధికారుల తీరుపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆక్రమణదారులపై పోలీస్‌లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అయితే కొన్నిచోట్ల ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన ఎన్ఓసీలు హైడ్రాకు తలనొప్పిగా మారాయని హైడ్రా అధికారులు చెబుతున్నారు.

ప్రధానంగా హైదరాబాద్ చుట్టుపక్కల లేక్‌వ్యూ ప్రాజెక్ట్‌లలో చాలా వరకు బఫర్‌జోన్‌లో లేదా ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయా అనేది నిర్ధారించాల్సిన అధికారులు తప్పుడు నివేదికలు ఇచ్చి, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇచ్చినట్లు తేలడంతో తాజాగా ఎనిమిది మంది అధికారుల పేర్లతో ఒక లిస్ట్ తయారు చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని త్వరలోనే రంగనాథ్ సాక్ష్యాధారాలతో సహా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది. ఇందులో ఏ చెరువుకు సంబంధించి ఏ అధికారి హద్దుల నిర్ధారణలో అవకతవకలు చేశారనే అంశాన్ని పొందుపరిచి సమగ్ర నివేదిక తయారు చేస్తున్నారు. దీని కోసం ఇద్దరు ఇరిగేషన్ అధికారుల సహకారం తీసుకుని రిపోర్ట్ చేస్తున్నారని తెలిసింది. ఈ ఎనిమిది మందిలో ముగ్గురు రిటైర్డ్ అధికారులు కూడా ఉన్నట్లు తెలిసింది. తమ హయాంలో చాలా ప్రాజెక్ట్‌లకు ఎన్ఓసీలు ఇవ్వడంలో ఈ అధికారులు కీలకపాత్ర పోషించారని హైడ్రా, ప్రస్తుత నీటి పారుదల శాఖ అధికారులు తేల్చారు. వీరి విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి కూడా హైడ్రా తీసుకెళ్లినట్లు తెలిసింది.

29న లంబాడీల మహాగర్జన

షాద్‌నగర్, డిసెంబర్ 19 : లంబాడీ భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో పొందుపర్చాలని, శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న షాద్‌నగర్‌లో లంబాడీల మహాగర్జనను నిర్వహించనున్నట్లు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ గురువారం తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఈ భారీ బహిరంగ సభను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా షాద్‌నగర్‌లో సన్నాహక సమావేశాన్ని నిర్వహించి సభా నిర్వహణపై చర్చించామని తెలిపారు. లంబాడీల మహా గర్జనను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంతోపాటు రాష్ట్రంలోని లంబాడా గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో పర్యాటక సమాచార కేంద్రం ప్రారంభం

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 19 : దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునేందుకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ సరికొత్త ఆవిష్కరణలను శ్రీకారం చుడుతుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గురువారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పర్యాటక సమాచార కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటకులకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన వారసత్వ ప్రదేశాలు, సుసంపన్నమైన సాంస్కృతిక వైవిధ్యం, అబ్